Postal Regd.No. VSP-142/2009-2011

★ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in


Head Office : D.No. 3-178, 5th Lane,
ADARSH NAGAR, VISAKHAPATNAM-530 040
ANDHRA PRADESH, INDIA.

RNI APTEL /2006/17980
(REGISTRAR OF NEWS PAPERS FOR INDIA)
www.christavanaadu.com

Published from VISAKHAPATNAM | సంపుటి : 5 | సంచిక : 3 | ఎడిటర్ : వై.కనకరాజు | 2010 సెప్టెంబర్ 16-30 | పేజీలు : 8+4 | వెల : 5/-

★ రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

★ ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు




★ ఆయన ఇశ్రాయేలులో తన్ను తాను 'మహిమోన్నతుని' గా కనబరుచుకొనును.

నేడు లోకాన క్రైస్తవులుగా పిలువబడు వారందరని గూర్చి పరిశుద్ధగ్రంథమైన బైబిలు ఇస్తున్న సాక్ష్యం... దేవుని ఇశ్రాయేలు వారని, క్రీస్తును బట్టి క్రైస్తవులందరిని గూర్చి కొత్త నిబంధన గ్రంథంలో దేవుని 'ఇశ్రాయేలీయులుగా' వ్రాయబడింది. వారందరిలో ప్రభువైన యేసుక్రీస్తే 'మహిమోన్నతుని'గా పై లేఖనం సాక్ష్యమిస్తుంది. కాబట్టి మనందరం ఆయనను 'మహిమోన్నతుని'గా కీర్తించుట, ప్రకటించుట చేస్తున్నాం. ఒకవిధంగా యేసును గూర్చి ఆలోచిస్తే ఆయన సర్వలోకంలో 'మహిమోన్నతుని'గా అగుపిస్తారు. అదెట్లు? అన్న ప్రశ్నకు 'క్రీస్తుశకమే' జవాబు. ఆ విధంగా తన పేరును బట్టి చరిత్రను వ్రాయునట్లు చేసుకున్న విధానం 'మహిమోన్నతం'..అది చరిత్రకాధారం. ఆలోచించు వారెవరికైనా ఆశ్చర్యకరం. బైబిలు చరిత్రలో ఆధారాలు గల గ్రంథంగా గుర్తించబడింది. అట్టి బైబిలు ప్రభువును 'మహిమోన్నతుని'గా ఇస్తున్న సాక్ష్యాలు కోకొల్లలు.


ఆయన కార్యాలను గూర్చి వ్రాయుటకు భూలోకమైన చాలదంటుంది బైబిలు. ఇది అక్షర సత్యమని ఎరుగని క్రైస్తవులుందురా? ఉండరు. కాబట్టి ఆయనను గూర్చి సంపూర్ణంగా 'బైబిలు ప్రకారం' ఎరుగుటకు ఇష్టపడువారే తండ్రియైన దేవుని చిత్తాన్ని నెరవేర్చగలరనే బైబిలుమాట నూటికి నూరుపాళ్ళూ అనుసరణీయమే. అలాంటివారికి మాత్రమే ఆయనను గూర్చి విశదమవుతుంది. ఆయన 'మహిమోన్నతత్వం' కనబడి రుజువు పర్చుకొంటుంది. **'ఆయనను గూర్చి నేటి నుంచే చెప్పడం ప్రారంభిస్తే ముగుయుటకు ఈ జీవితం చాలదేమోనని నాకు తోస్తుంది.'** అలా ప్రకటించు వారికి తగు సహాయం ప్రభువు దయచేస్తూనే ఉన్నారు. మనవలన ఆయన మహిమ పర్చబడాలి. ఆ మహిమకంటే ఆయనే ఉన్నతుడని లేఖనాల ప్రకారం ఆయనే కనబర్చుకోగలరు. కావున **'ఎవరైనా ప్రభువును మహిమపరుస్తూతామేదో ఆయనకు కీర్తి తెస్తున్నాం అని భావించరాదు. అట్లు భావించు వారెవరైనా ఉంటే వారు ప్రభువును గూర్చి సమగ్రవగాహన లేనివారేనని మనం సుళువుగా తెలుసుకోవచ్చు.'** అందునుబట్టి లోకంలో ఆయనను ప్రకటిస్తూ ఘనులుగా పిలువబడువారు ఆ ఘనత తమదికాదని ప్రభువుదని తక్షణం తెలుసుకోవాలి. ఆ మహిమను ఘనతను ప్రభువుకే ఆపాదించాలి.

*(వచ్చే సంచికలో)*

## ప్రత్యేక విన్నపం

పాఠకులకు, కాపర్లకు, క్రైస్తవనాయకులకు , మిషనరీలకు, సహకరిస్తున్న అనేకులకు మా కృతజ్ఞతలు. రెవ. పురుషోత్తమ చౌధరి 208వ జయంతి ఉత్సవ సందర్భంగా జరుగనున్న 'రాష్ట్రస్థాయి ఆంధ్ర క్రైస్తవ కవి సమ్మేళనం, సన్మానం' ప్రత్యేక సంచికను ఈ సంచికతో పాటు అందుకోండి. ఇలా ప్రత్యేక సంచికలు మీ ప్రేమను బట్టి మా వీలునుబట్టి ఇస్తుంటాం. అందుకై మా కొరకు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుంచుకోవాలని కోరుతున్నాం. దేవుని కృపను బట్టి, ఇప్పటికే మీరందిస్తున్న మీ అందరి ప్రార్థనా సహకారాలను బట్టి క్రైస్తవనాడు రాష్ట్రాలు దాటింది. విశ్వవ్యాప్తంగానున్న తెలుగు క్రైస్తవులు, పాఠకులు చదువుకొనేందుకు వీలుగా దేవుడు www.christavanaadu.com మన అందరి మేలుకై ఇచ్చారన్నది ఇప్పటికే ఎందరో ఇస్తున్న సాక్ష్యం మాకెంతో ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ వెబ్‌సైట్‌లో క్రైస్తవనాడు సంచికలతో బాటు వ్రాయబడిన వ్రాతలైనా, మా చేతలైనా దేవుని మహిమ పరచుటయేగాక దేశ ఔన్నత్యాన్ని, సార్వభౌమత్వాన్ని లోకానికి తెలియజేసేవిగా ఉంటాయన్నది మేమిస్తున్న భరోసా. కాబట్టి పాఠకులందరూ విదేశాలోనున్న మీ వారికి ఈ వెబ్‌సైట్‌ను గూర్చి తెలియజేయండి. ఆయా దేశాల్లో వారికి దేవుని వాక్యాన్ని వెదజల్లి ఓ స్నేహితునిలా క్రైస్తనాడు ఉంటుందని నా నమ్మకం. అందుకు మీ సాక్ష్యాలే మాకు ఆధారం.. బలం. -క్రైస్తవనాడు ఫ్యామిలీ

**N**orth **E**ast **W**est **S**outh



## నేషనల్ మిషన్ అథారిటీ సభ్యునిగా ముఖ్యమంత్రి రోశయ్య


నేషనల్ మిషన్ అథారిటీ సభ్యునిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె. రోశయ్యను కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీని ద్వారా మహిళా సాధికారత జాతీయ కార్యక్రమాలు అమలు చేస్తారు. ఈ అథారిటీకి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వం వహిస్తున్నారు.



## విద్యార్థులకు శుభవార్త

విద్యార్థులు తమకు అనుకూలమైన తేదీల్లో పరీక్ష రాసే అవకాశాన్ని 'ఇగ్నో' కల్పించనుంది. దాదాపు 12 కోర్సుల్లో ఈ కొత్త పథకాన్ని అమలు చేయనున్నారు. పరీక్ష రాసిన 60 రోజుల్లోగా ఫలితాలను ప్రకటిస్తారు.

## భారత్, చైనా సవాళ్లను తట్టుకోవాలి : ఒబామా



బెంగళూరు, బీజింగ్ నుంచి విద్యారంగంలో వస్తున్న సవాళ్లను తట్టుకోవాలని అమెరికన్ విద్యార్థులకు ఆ దేశ అధ్యక్షుడు బరాక్ ఒబామా పిలుపిచ్చారు. తద్వారా అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టాలన్నారు.

***లోకోక్తి :*** హృదయం, మేథస్సుకన్నా గొప్పది. అందుకే మంచి స్నేహితుల్లాంటి పుస్తకాలు చదివి హృదయాన్ని సహృదయంగా మనచుకోండి.
-మహాత్మగాంధీ

## ఆస్ట్రేలియా తొలి మహిళా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన జూలియా గిలార్డ్

ఆస్ట్రేలియాకు తొలి మహిళా ప్రధానిగా జూలియా గిలార్డ్ ఎన్నికైయ్యారు. కేవలం 3 నెలల వ్యవధిలో ఆమె ఆ పదవికి రెండు సార్లు ప్రమాణ స్వీకారం చేసారు.

## మౌలికవసతులను బలోపేతం చేయాలి : సుప్రీం

న్యాయశాఖకు సంబంధించిన మౌలిక వసతులను బలోపేతం చేయాలని అన్ని రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. లేకుంటే ప్రభుత్వ ప్రధాన కార్య దర్శులను న్యాయస్థానానికి రప్పిస్తామని హెచ్చరించింది. క్రిందికోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ నివేదికలను ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి రాష్ట్రాలను ఆదేశించారు.

## ఘనంగా భీమిలీ 150 సం॥ల ఉత్సవాలు

చరిత్ర కలిగిన భీమిలీ 150 సంవత్సరాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల ప్రారంభానికి ముఖ్యమంత్రి రోశయ్య రాలేకపోయినా ఆయన తరపున జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. 17 కోట్ల రూపాయలతో నిర్మించిన భారీ తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. భీమిలీకి మహర్దశ పట్టనుందని నాయకులు చెప్తున్నారు.




★ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము

# ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను...!



రాష్ట్రవ్యాప్తంగా డా.ఎన్. జయకుమార్‌రావును ఎరుగని సాహితీవేత్తలుంటారంటే నమ్మబుద్ధికాదు. సాహితీసేవేకాదు గాని సమాజసేవలోనూ ఆయన దిట్టే. 'కాటికి కాళ్లు చాపుకున్న' వాడనని ఆయనే అనేకసార్లు చెప్తుంటారు. అవును మరి వయస్సేమో 76! అయినా దేవునికోసం బలంగా వాడబడుతున్నారు. రాష్ట్రక్రైస్తవ కవులకు, రచయితలకు తనవంతుగా ఏదైనా చేయాలని, తద్వారా వారిని తానుంటున్న విశాఖ వాసులకు పరిచయం చేయాలని ఈ వయసులో సంకల్పించుట బహు విడ్డూరం. అందుకు వయసు ఆయనకు అడ్డుకాలేకపోయింది. దేవుడే కార్యక్రమాన్ని ఆద్యంతం నిర్వర్తించుకుంటారన్న భరోసాయే ఆయన్ను నడిపిస్తుంది. ఇదివరకెన్నడూ ఎవ్వరూ ఎక్కడా చేయనది ఈ 'కవిసమ్మేళనం-సన్మానం. అవును ఇది ముమ్మాటికి నూతనక్రియే! అందునా విశాఖ నుంచే మొదలు. అదీ సాహితీవేత్త, ఎందరో రచయితలకు మార్గదర్శియైన డా. ఎన్. జయకుమార్‌రావు ద్వారా జరుగుట రాష్ట్రవ్యాప్త క్రైస్తవ కవులకే గాక యావత్ క్రైస్తవ లోకానికి ఆనందమే. అందుకు తగ్గ సందర్భం ఆంధ్రక్రైస్తవ సంగీత కవి సార్వభౌమునిగా కీర్తించబడుతున్న రెవ. పురుషోత్తమ చౌధరి 208 జయంతి కానుండడం ఓ విశేషం. ఇదే వేదికగా డా.ఎన్. జయకుమార్ రావు కవితా సంపుటి 'మనుసులోతుల్లోకి దూరి' ఆవిష్కరణ సంరంభ వేడుకా జరుపుట ఆహూతులకు కన్నులపండుగే. మొత్తంగా ఇది 'రాష్ట్రక్రైస్తవ సాహితీ మహోత్సవం'. అందర్నీ ఒకే వేదికపై చూడగల భాగ్యం విశాఖవాసులకు దక్కడం ఓ వరం. డా.ఎన్. జయకుమార్ రావు తదుపరి ఆలోచనల్లో పుట్టే ప్రతీ కార్యక్రమం సఫలమయ్యేట్లు తద్వారా ప్రభువైన యేసుక్రీస్తు మహిమ పరచబడేట్లు మనవంతుగా ప్రార్థిస్తూ... సహకరిద్దాం.

*-వైకెయార్*

***లోకోక్తి :*** మనకోసం మనం చేసేది మనతోనే అంతరించిపోతుంది. పరులకోసం చేసింది శాశ్వతంగా నిలిచిపోతుంది.

# క్రైస్ట్ సాల్వేషన్ చర్చి 27వ వార్షికోత్సవం





*సెప్టెంబర్ 11*

***అడ్డురోడ్డు :*** రెవ.డా. డేవిడ్ కిరణ్ కుమార్ క్రైస్ట్ సాల్వేషన్ చర్చి 27వ వార్షికోత్సవ వేడుకలను జరిపారు. ఈయన ఈ చర్చి వ్యవస్థాపకులైన సినియర్ పాస్టర్ బి.జె.వి. ప్రసాద్ తనయులన్నది క్రైస్తవనాడు పాఠకులకు విదితమే. సీనియర్ పాస్టర్ బి.జె.వి ప్రసాద్ గతేడాది అక్టోబర్ 17న ప్రభువునందు నిద్రించిన విషయమూ పాఠకులకు తెలిసిందే. తండ్రిలేని లోటు కనబడనీయక కార్యక్రమాన్ని ఆద్యంతం ఓ క్రమంలో నిర్వ హించిన రెవ.డా. డేవిడ్ కిరణ్ కుమార్‌ను పాల్గొన్న కాపర్లు, స్థానిక సంఘ విశ్వాసులు అభినందిస్తూ కొని యాడారు. రాబోవు రోజుల్లో కూడా తండ్రిని మించి సేవచేయాలని, అక్కరత గలవారికి అన్ని విధాలా సహకరించాలని, తన ద్వారా నడిపింపబడుతున్న అందరికి మాదిరిగా ఉండాలని కోరుకుంటున్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో రెవ. ఎల్.ఎమ్.పి.ఎస్.కుమార్ ప్రసంగించారు. సి.హెచ్. హజరయ్య గ్రీటింగ్స్ చెప్పారు. క్రైస్తవనాడు ఎడిటర్ వార్షికోత్సవ వేడుకల్లో సినియర్ పాస్టర్ బి.జె.వి. ప్రసాద్ మరియు వారి కుటుంబంతో సంఘంతో తనకు గల అనుబంధాన్ని గ్రీటింగ్స్ ద్వారా తెలిపారు. ఆ మాటల శైలిలో సినియర్ పాస్టర్ బి.జె.వి. ప్రసాద్ గుర్తొచ్చారని ఆయన కుటుంబస్థులే గాక ఆయన్నెరిగిన వారు, సంఘస్థులు కూడా ఎడిటర్‌తో చెప్పారు.

**ఇప్పుడు వెబ్‌సైట్‌లో... క్రైస్తవనాడు** www.christavanaadu.com

# యేసు మాస్టారు – దుడుకు శిష్యుడు

పేతురు పేరు వినగానే దుడుకుతనం, తొందరపాటు, ఉద్రేకం వంటి లక్షణములు మనకు గుర్తుకు వచ్చును. అయితే కచ్చితంగా ఈ 'పేతురు'నే ప్రభువు తన అద్భుత చర్యల ద్వారా తన సంఘమును కట్టుటకు వాడుకొనెను. అంతకమునుపు అతని జీవితమును సరిచేసెను, తనతో పేతురును అతి దగ్గరగా వెంబడింపజేయుట ద్వారా ప్రభువు అతనికి కొన్ని సత్యములను నేర్పించెను.

1. ***లోబడుట*** (Submission) :

మత్తయి 17:24 - ప్రభువును, పేతురును ఒక పర్యాయము పన్ను చెల్లింపవలసియుండెను. ఈ లోకమునందు అధికారులకు లోబడుట ద్వారా క్రైస్తవులుగా మన పైనున్న నాయకులకు లోబడుట, లెక్క అప్పగించుట, బాధ్యతను గుర్తించి ప్రవర్తించుటవంటివి ఆ సమయమున ప్రభువు పేతురునకు నేర్పించెను. ప్రభువునొద్ద నేర్చుకొన్న విషయాలే తదుపరి కాలంలో 'మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడి యుండుడని దేవుని సంఘానికి బోధించాడు'. (1పేతురు 2:13) దేవుని ప్రజలు మేలు చేయు వారిగా నుండి యుక్త ప్రవర్తన గలవారై యుండుట అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరు మూయుటయని, ఇది దేవుని చిత్తమని తెలియజెప్పాడు. ప్రభువు కూడా ఇతరులకు అభ్యంతరముగా నుండకుండునట్లు కపెర్నహూమునందు అరషెకెలు పన్ను చెల్లించెను కదా! ప్రభుత్వములు దేవుని చేత ఏర్పరచబడినవి మనము ఎరుగుదుము.

2. ***సహనము*** (To Control or to Limit) :

యేసును బంధించుటకు వచ్చిన వారి యొదుట పేతురు తనను తాను అణచుకొనలేక ప్రధాన యాజకుని దాసుడైన మల్కు అను పేరుగల వాని కొట్టి, అతని మీద కత్తి దూసెను. బహుశా ఆ వ్యక్తి కొద్దిగా ప్రక్కకు తప్పించుకొని యండవచ్చు. కేవలం అతని చెవి మాత్రమే తెగినది (యోహాను 18:10,11). తాను బంధింపబడుచున్న సమయములో కూడా ప్రభువు 'మల్కు' చెవి ముట్టి బాగుచేయుట పేతురు చూసాడు. ఆ సమయమున ప్రభువు పేతురు హృదయములో మిగిల్చిన జ్ఞాపకాలే, "తప్పిదమునకై దెబ్బలు తినినప్పుడు మీరు సహించిన యెడల మీకేమి ఘనము? మేలు చేసి బాధపడునప్పుడు మీరు సహించిన యెడల అది దేవునికి హితమగును; ఇందుకు మీరు పిలువబడితిరని'' దేవుని ప్రజలతో మట్లాడించాయి (1 పేతురు 2:20).ఇవి పేతురు తన పత్రికలయందు చెప్పిన సంగతులు. ప్రభువు చూపిన మాదిరి పేతురుకు లభించిన నిజమైన పాఠము.

3. ***తగ్గింపు*** (Humility) :

ప్రభువు తన్నుతాను దాసునిగా తగ్గించుకొని సిలువ మరణము పొందుటకై ఈ భూమి మీదకు వచ్చెను, ఈ సంగతులనెరుగని పేతురు ఆలాగున ప్రభువునకు జరుగకూడదని తలంచి మత్తయి 16:22లో మాట్లాడుచున్నాడు-'ప్రభువా అది (సిలువ మరణము) నీకు దూరమగుగాక, అది నీకెన్నటికిని కలుగదు''. అతడింకనూ- అందరూ అభ్యంతర పడినను నేను అభ్యంతర పడనని, నేను నీతో కూడా చావవలసి వచ్చినను నిన్ను ఎరుగనని చెప్పనే చెప్పనని మాట్లాడుచున్నాడు (మార్కు14:29-31). ఉపేక్షించుకొనుట, సిలువ నెత్తుకొని వెంబడించుట మాత్రమే యేసునొద్ద మనకు లభించు ఉన్నత జీవితము. వీటిని గ్రహించిన తదుపరి మాత్రమే, "చిన్నలారా, మీరు పెద్దలకు లోబడియుండుడి; మీరందరూ ఎదుటి వాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించు కొనుడని' తన పత్రికల ద్వారా తెలియజెప్పగలిగాడు (1పేతురు 5:5).



**బ్రదర్ జె. ఫిలిప్**

*(వచ్చే సంచికలో...)*

**త్వరలో! క్రీస్తును ప్రకటించువారు పోలీస్ స్టేషన్లు, కోర్టులు, జైలులకెళ్ళొచ్చా..?! లేఖనాలనుకూలంగా.. వివరణలు**


యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

**SAHITHI CERAMICS**



**ALL WALL & FLOOR TILES**

SANITARY WARE

*#48-1-22/2, Srinagar, Near Ramatalkies, Visakhapatnam-16*

**Phone : 0891-6455880, Mobile : 92 91 49 18 15**

**క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు**

వివరాలు సంపూర్ణంగా తెల్సుకొనేందుకు సంప్రదించండి!

| B&W | FULL PAGE | HALF PAGE | QTR. PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 4,500/- | 2,250/- |
| CENTRE PAGES | 5,000/- | 2,500/- | 1,250/- |
| REAR PAGE | 8,000/- | 4,000/- | 2,000/- |

| COLOUR | FULL PAGE | HALF PAGE | QUATER PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 9,000/- | 4,500/- |
| CENTRE PAGES | 8,000/- | 4,000/- | 2,000/- |
| REAR PAGE | 16,000/- | 8,000/- | 4,000/- |

**ఫోన్ : 9346960601, 9490266640, 9292006116**

*Syam Thota (TSR)* యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

**Sahithi Jewellers**

**BODWIN COMPLEX, SHOP NO. : 6**

**D.NO. : 25-8-270, NEAR READING ROOM,**

**VISAKHAPATNAM -530 001**

**Phone : 0891-6588102, Mobile : 8019465576**

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



సంపుటి:5 సంచిక:3 16-30 సెప్టెంబర్, 2010

★ ★ ★

# స్వపరీక్ష

అవును ఇది అందరికీ అవసరం. తద్వారానే దినదినం మనం దేవునిలోను, లోకంలోను ఘనతకు పాత్రులవగలం. 'స్వపరీక్ష'యే లేనినాడు జీవితం రాణించదు. నిన్నటిలానే నేడూ ఉంటే ఏం లాభం? అలా ఉండకూడదనుకున్నవారు తమను తామెల్లప్పుడూ పరీక్షించుకుంటుంటారు. తమను తాము ప్రక్షాళన చేసుకుంటుంటారు. ప్రతి మనిషిలో దేవుడు తన ఆత్మను ఉంచారు. ఆయాత్మే మనం చేసేది మంచిది కానప్పుడు హెచ్చరిస్తుంది. ఎదుటివారిని మభ్యపెడుతున్నప్పుడు ఇది తప్పు అని గుర్తుచేస్తుంది. అట్టి ఆత్మను పొందుట మనిషికోవరం. ఆయాత్మ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయొద్దు. అలాగే ఇతరుల ద్వారా కూడా ఒక్కోసారి మనకు హెచ్చరికలు వస్తుంటాయి. ఆ విధంగా వచ్చిన వాటన్నిటిని గుడ్డిగా నమ్మక మేలైనది గుర్తెరుగుటే విజ్ఞుల లక్షణం. గుర్తెరిగేందుకు మనకైతే బైబిలుంది. అది మనకో భాగ్యం. అందున్న దేవుని మాటలే మన భావి జీవితాన్ని నిర్దేశించాలి. వాటిని బట్టి ఈ లోకంలో మనుగడ సాగిస్తే మనం అనేకులచే గుర్తించబడతాం. మరెందరికో ఆదర్శప్రాయులంగా మారగలం. మనల్ని మనం 'స్వపరీక్ష' చేసుకొనేందుకు దేవుడిచ్చిన వరమే బైబిలన్నది మరువకండని మరోసారి గుర్తుచేస్తున్నా. ఆహా! దేవుడెంత మంచివాడు. ఆయనకు మనపై ఉన్న ప్రేమెంత గొప్పది. ఏమని వర్ణించగలను? వర్ణించేందుకు నా కడవరకు ప్రయత్నిస్తాను. అందుకు దేవుని వాక్యం ద్వారా నన్ను నేను ఎల్లప్పుడు 'స్వపరీక్ష' చేసుకుంటూనే ఉంటాను. అదే నా కుటుంబానికీ మాదిరి. అందుకు దేవుడే నాకు సహాయకులు. మీ ప్రార్థనలూ అందుకు తోడు. **'దేవునికి స్తోత్రం'**

వై.కె.

★ **"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము...... మా కొరకు ప్రార్థించుడి"**

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 75

బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటివరకూ సైన్స్ సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలియజేప్పుటకు చేయు ప్రయత్నమే ఈ "దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్ధేశము.



\- వై.ఎల్. రవిరాజు

*ఆయన ప్రేమను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు జ్ఞానాన్ని గత మూడేండ్ల నుంచి నా ద్వారా వ్రాయిస్తూ, ఈ శీర్షికను నడిపిస్తున్న మన తండ్రియైన 'దేవునికి స్తోత్రం'. నేను వయస్సులో చిన్నవాడినైనా దేవునిలో నిరంతరం ఎదుగుటను బట్టి దేవునికి కృతజ్ఞాతాస్తులు చెల్లిస్తున్నాను. నన్ను ఇంతగా వృద్ధిచేస్తున్న దేవునికి మరో మారు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటున్నా. నా కొరకు మీరును మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుంచుకోవాలని కోరుతున్నా.*

దేవుని జ్ఞాన ప్రవాహపు లోతుల్లోకి వెళ్దామా మరి...

మనిషి జననం నుండి మరణం వరకు అనేకసార్లు చిన్నా చితకా జబ్బులతోపాటు కొన్నిసార్లు భయంకరమైన రోగాల భారినా పడుతుంటాడన్నది తెలిసిందే. కొన్ని రోగాలు నయం అయితే మరికొన్నింటివల్ల మరణించుట కూడా జరుగుతుంది. కొన్నిసార్లైతే అంతుపట్టని రోగాలతో సతమతమవుటా మనం చూస్తున్నాం, వింటున్నాం. వాటి నిమిత్తమై పరిశోధనలు చేసి మందులను కనుగొనుటలో కొందరు శాస్త్రవేత్తలు నిమగ్నమైపోయారు. నేడు లోకంలో భరించలేని రోగాలతో అనేకమంది తమ జీవిత కాలాన్ని అర్థంతరంగా ముగించుకొనుట ఎంతో బాధాకరం. అసలు ఈ రోగాలు రావటానికి కారణం ఏంటి? ఎందుకు వస్తున్నాయి? అనేది మాత్రం మిలియన్ డాలర్ ప్రశ్నే. కొన్ని సందర్భాల్లో మనిషికి వచ్చిన రోగమేంటో కూడా తెలియనట్లుంటుంది. ఆ రోగమేంటో తెలియక పరిశోధకులు వారికి నచ్చిన పేర్లను ఆ రోగానికి అనుగుణంగా పెట్టుట కూడా మనం చూస్తున్నాం. కొన్నిసార్లు మనం కూడా ఈ రోగాల భారిన పడతామేమోనని కూడా భయపడుతుంటాం. ఎక్కడ ఏ రోగమొస్తుందోనని అనేకులు జీవన శైలిలోను తినుటలోను, తిరుగుటలోను అనేక జాగ్రత్తలు తీసుకొంటుంటారు. రోగం వస్తుందేమోనని భయపడి బ్రతుకుతున్నది కొందరైతే, రోగం వచ్చిన తర్వాత ఆ రోగం వల్ల చనిపోతామేమోనని భయపడేది మరికొందరు. తల్లి గర్భంనుండి వచ్చిన శిశువుకు లేని రోగాలు భవిష్యత్తులో వచ్చుట కడుశోచనీయం. అందుక్కారణం ఇష్టానుసార జీవన విధానలేననుట నిర్వివాదం. పుట్టే ప్రతి శిశువుల్లో కొందరు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఏదో ఒక లోపంతో పుడుతుంటారేమో గాని, పుట్టినవారిలో పూర్తి ఆరోగ్యం కలిగిన వారి సంఖ్యే అధికమన్నది మనం గ్రహించాలి. పుట్టినప్పుడు లేని రోగాలు పుట్టాక ఎందుకు వస్తున్నాయి? ఆలోచించాలి. శరీరం ధరించిన ప్రతి మనిషీ తన జీవితకాలంలో ఏదో ఒక అస్వస్థతకు గురౌతాడన్నది నమ్మాల్సిందే. అంటే రోగం రావటానికి ప్రధాన కారణం 'శరీరం' అన్నది గ్రహించాలి. శరీర బలహీనతల వల్లే కదా మనుష్యులకు ఈ రోగాలు, జబ్బులు. అంటే మనుష్యులు ఎంతో ఇష్టపడే శరీరమే వారికి మొదటి శత్రువా? అవుననే అర్థమౌతుంది కదూ..! ఏ రోగం వచ్చినా, ఏ జబ్బువచ్చినా ఈ శరీరం వల్లే కదా. అంటే రక్తమాంసాలు కలిగిన ఏ శరీరానికైనా రోగాలు తప్పవని మనం గమనించాలి. రోజు అద్దంలో ఎంతో అందంగా కనబడే ఈ శరీరమే మనలను రోగస్థులనుగా చేస్తుందనుటలో ఏలాంటి అనుమానం లేదు. అందువల్ల జీవించినంతకాలం శరీరాన్ని కాపాడుకొనుటకు తగు జాగ్రత్తలు వహించాలి. అయినా సరే చివరకు ఈ శరీరాన్ని వీడక తప్పదు. మరణం పేరున ఈ లోకాన్ని విడుస్తున్నాం. అలా మన జీవితాలు ఈ భూమ్మీద ముగుస్తాయి. అంతవరకు శరీరాన్ని నడిపింది ఏంటన్నది ఎందరికో తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆత్మయే శరీరాన్ని నడుపుతుందని శరీరం కేవలం నిష్ప్రయోజనమన్న యేసు మాటలు మనకెంతో ఆధరణ. అందువల్ల ఆత్మకు కావాల్సిన బలమైన ఆహారం దేవుని వాక్యమని మనమెరుగుతున్నాం. అందును బట్టి 'దేవునికి స్తోత్రం'. బ్రతుకు కాలంలో శరీరానికి ఏ రోగం వచ్చినా డాక్టరు దగ్గరకు వెంటనే వెళ్లి రోగాన్ని తగ్గించుకోడానికి ప్రయత్నిస్తుంటాం. అందుకు కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ఇది అందరూ చేసేదే. గాని దేవుడు దయచేసిన ఆత్మను కాపాడుకొనేందుకు జాగ్రత్తలు తీసుకొనేవారెందరు? ఇది కొందరికి చోద్యంగా అన్పించొచ్చు. కానీ అది నిజం. ఆత్మను జీవింపజేసేందుకు జాగ్రత్తలు తీసుకొనుట తప్పనిసరని యేసు మాటలను బట్టి మనమెరుగుతున్నాం. ఆత్మకు శరీరానికి గల సంబంధ భాందవ్యాలు ఏపాటివో దేవుని వాక్యంలో ఓసారి చూద్దాం..

★ **శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును.ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవిచేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు.**

శరీరం ఆత్మకు, ఆత్మ శరీరానికి విరోధముగా ఉంటాయని చదివారుగా. ఈ భూమ్మీద మన విరోధిని మనమే ఇంట్లో ఉంచుకోము సరిగదా కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వం. కన్పడితే వాడిని ఎలా బాధపెట్టాలోనని ఆలోచిస్తాం. మరి మన విరోధి మన శరీరమేనని పై లేఖనం ద్వారా గ్రహించిన తర్వాత ఏం చేస్తారు మన శరీరమనే విరోధిని? ఆ విరోధి మనకు స్నేహితునిగా మారే మార్గం ఉందా? మన శరీరం మన ఆత్మలకు స్నేహితునిగా మార్చాలంటే దేవునిలో నలుగగొట్టాలి. అప్పుడే ఈ దేహం మనలను పరలోకానికి నడిపించే సాధనంగా మారుతుంది.

గమనిక : మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలని గమనించగలరు.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వై.కె.రాజు, వై.ఎల్. రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

క్రైస్తవనాడులో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తి గత అభిప్రాయాలు మాత్రమే. పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

క్రైస్తవనాడు విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి.మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి.

CHRISTAVANAADU ON LINE A/C Current Account No. : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsh Nagar Branch, Visakha-530 040.

సం॥ చందా రూ. 200/-లు. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు ఉచితం! చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం భాధ్యత వహించలేం. పాఠకులిది గమనించి సహకరించగలరు. -ఎడిటర్. సంప్రదించండి : 9490266640, 9346960601.

గమనిక: మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి గమనించగలరు.

★ ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును

వై.కనకరాజు, వై.ఎల్. రవిరాజులు వ్రాస్తున్న ప్రతి వివరణ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం! పాఠకులిది గమనించగలరు. అందుకై తదుపరి సంచికలు ఫాలో అవ్వండి.

★ సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయు వాటినే ఆసక్తితో అనుసరింతము.

**5వ సంవత్సరములో ప్రవేశించిన క్రైస్తవనాడును అభినందిస్తూ అనేకులు ఫోన్ల ద్వారాను, ఇ-మెయిల్స్ ద్వారాను, ఉత్తరాల ద్వారాను తమ అభిమానాన్ని వ్యక్తపర్చారు. వారందరికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాబోవు సంచికల్లో ఆయా అభినందనల వివరాలు ఇస్తాం.**

# దేహ విమోచనము

## Redemption of Body

**ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము దత్తపుత్రత్వము కొరకు అనగా మన దేహముయొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము. రోమా 8:23.**

దైవజనుడైన పౌలు ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచినవారు, తమలోతాము మూలుగుచున్నారు అని వ్రాయుచున్నాడు. వారు దేని కొరకు మూలుగుచున్నారు? **దేహము విమోచన కొరకు** (Redemption of Body). దేహవిమోచన అనగా క్షయమైన ఈ శరీరం అక్షయతను ధరించుకొనే అనుభవం. ప్రభువైన యేసుక్రీస్తు మేఘమండలముల మీదికి వచ్చినప్పుడు మనము వధువు సంఘముగా ఆయనతో విందులో పాల్గొనే ఆ ఉన్నతమైన అనుభవం.

ఈ లోకములో ఉన్నవారు కూడా మూలుగుచున్నారు. ఎందుకు? జీవితకాలమంతా ప్రయాసపడినా తమకు సంతృప్తి కలుగజేయని లోకసంబంధమైన వాటికొరకు. వారి మూలుగులు, సణుగులు ఆత్మను దుఃఖపరుస్తాయే గాని, వాటివలన ఏ ప్రయోజనము ఉండదు. **మనోదుఃఖమువలన ఆత్మ నలిగిపోవును కదా!** ఈలాటి సణుగులు, సంశయాల వలననే అరణ్య యాత్రలో ఇశ్రాయేలీయులలో అనేకులు కూలిపోయారు. లోకసంబంధమైనవి నిజమైనవి కావు, అవి శాశ్వతమైనవి కావు. ఈ లోకములో ఉన్నదంతయును శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవి. **1 యోహాను 2:6.** అయినా నేటి దినాలలో ప్రజలు నిరంతరము నిలుచువాటికొరకు ప్రయాసపడరు గాని, గతించిపోవువాటి కొరకు ఎంతో ప్రయాసపడుట శోచనీయం.

పాఠకులారా! దేవుని ప్రజలు ఆత్మలో మూలుగుచుండుట ద్వారా కలిగే ఆశీర్వాదమేమిటో గమనించండి. దైవజనుడైన పౌలు థెస్సలొనీకయ సంఘాన్ని గూర్చి ఇలా ప్రార్థిస్తున్నాడు. **"మీ ఆత్మయు, మీ జీవమును, మీ శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితము గాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక"** 1 థెస్స 5:23 దేవుడు తన స్వరూపమందు తన పోలిక చొప్పున నరుని సృజించాడు కదా! దేవుని మనస్సు కలిగియుండవలసిన నరుడు ఆదిదంపతుల అవిధేయతవలన పాపమునకు దాసుడై, క్రొత్త క్రొత్త పాపాలను కనిపెట్టి తన హృదయములో నింపుకుంటున్నాడు. అందువలననే "**హృదయము మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలది**" అని యిర్మీయా "**వ్యాధికలది**" అని యిర్మీయా భక్తుడు చెప్పుచున్నాడు. అంతమాత్రమే కాక "**నరుల హృదయతలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని చూచాను**" అని దేవుడే చెప్పుచున్నాడు. అది. 6:5. ఈ రోజుల్లో మానవుని హృదయస్థితి మరింతగా పాపపు మురికితో నిండియున్నది. అట్టి ఘోరహృదయముతోనే పుణ్యము సంపాదించుకొని, స్వర్గమును చేరవలెనని మానవుడు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. "**పాపము పరిహరింపడబకుండా స్వర్గధామము చేరుకొనట అసాధ్యము**" అయినా అట్టి భక్తినే చేస్తూ నిత్యనరకానికి పాత్రులవుచున్నారు. కొందరు తెలిసి, తెలసి ఊబిలో దిగి, అనేకులను ఊబిలోనికి దింపుచున్నారు. ఎంత ఘోరమో ఆలోచించండి.

మానవ నిర్మాణములో **ఆత్మ** (Spirit), **జీవము** (Soul), **శరీరము** (Body) అనునవి మూడు భాగములు. అలాగే రాబోయే నూతన సృష్టి నూతన అవకాశము, నూతన భూమి, నూతన యెరూషలేము అను మూడు భాగాలుగా ఉంటుంది. ఆత్మ దేవుని సంగతులను గ్రహిస్తుంది; జీవము మానవ సంబంధమైన సంగతులను గ్రహిస్తుంది. శరీరము లౌకిక సంగతులను గూర్చిన స్పృహ కలిగియుంటుంది. ప్రభువు రాకడ వరకు ఆత్మ, జీవము, శరీరము నిందారహితముగా కాపాడుకున్నవారే, ప్రభువు కాపాడునంతగా ఆత్మీయతలో ఎదిగినవారే __కడవరి రక్షణ__ లేదా __దేహవిమోచన__ పొందగలరని పరిశుద్ధ గ్రంథం సెలవిస్తుంది. విమోచింప శక్తిలేని భక్తిచేయుట వ్యర్థమని కూడా పౌలు పలుమార్లు హెచ్చరించాడు. కనుకనే "**సహోదరులారా, పరిశుద్ధమును, దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని**" బ్రతిమాలుచున్నాడు. **రోమా 12:1.**

దేహవిమోచన కొరకు మూలుగుచున్న మనము సాధించునది ఏమిటి? మనము మూలుగుచున్నది



రెవ.డా. ఎం. ఎ. పాల్

మనుజాశలు, లోకాశల నిమిత్తము కాదు గాని, నిత్యరాజ్యము కొరకు మూలుగుచున్నాము. ఆ రాజ్యములో చేరుట వలన ప్రయోజనమేమిటి అని ఆలోచించేవారు లేకపోలేదు. **నిత్యరాజ్యము - అది శాశ్వత రాజ్యము. ఆ రాజ్యమునకు అధిపతి దేవాదిదేవుడే. అక్కడ మరణము ఉండదు, దుఃఖము ఉండదు, వేదన ఉండదు, ఆకలిదప్పులుండవు, శాపగ్రస్తమైనదేదియు ఉండదు. ప్రతివాని కన్నుల భాష్పబిందువులు తుడిచివేయబడతాయి. దేవుని దాసులు ఆయన ముఖదర్శనము చేయుచు యుగయుగములు ఆయనతో జీవిస్తారు. ప్రకటన 21:4, 22:3,4.**

ఎంతటి సంతోషకరమైన శుభవర్తమానమో ఆలోచించండి. కనుక విమోచన దినమువరకు అనగా ఆయన రాకడను తేరిచూచుచు, ఆయనను కలసికొనుటకు సమర్థులమైయుండాలి.

*(వచ్చే సంచికలో)*

# అందరూ ఏకంకావాలి : హర్షకుమార్



*__15 సెప్టెంబర్, విశాఖపట్నం :__* సంఘమిత్ర ఆర్.ఎస్. జాన్ కన్వీనర్‌గా సి.బి.సి.ఎన్.సి. నాయకుల పీస్ మీటింగ్ స్థానిక వై.యం.సి.ఎ.లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం ఎం.పి. హర్షకుమార్ హాజరైయ్యారు. ఇప్పటి వరకు సి.బి.సి.ఎన్.సి. ఆస్తులను అమ్ముకొన్న వారిని ఎలా కట్టడి చేయాలి, ఆయా ఆస్తులను ఎలా కాపాడాలి, వాటిని ఎలా సద్వినియోగం చేయాలన్న సంగతులపై నాటి సమావేశంలో చర్చించారు. కాకినాడలో ఈ మధ్యే ఆస్తులను అమ్మిన డా.ఎం. రత్నకుమార్ కూడా ఈ మీటింగ్‌కు హాజరయ్యారు. విశాఖ కల్వరి చర్చి పెద్దయైన పి. సాదూ సుందర్ సింగ్ కూడా హాజరైన వారిలో ఉన్నారు. సమావేశంలో అనేక తర్జనభర్జనలు పడ్డారు. వివాదాలు అధికం కాకమునుపే ఎం.పి. హర్షకుమార్ అందర్నీ సమన్వయ పరిచారు. తాను ఈ మీటింగ్‌కి వచ్చేందుకు 'ప్రత్యేక' కారణాలేవీ లేవని మీరందరూ గుర్తించాలని చెప్పారు. క్రైస్తవన అభిమానిగా క్రిస్టియన్‌గా తాను మీ అందర్నీ కోరేది ఒక్కటేనంటూ మాట్లాడుతూ అందరిలోనూ ఐక్యత రావాలన్నారు. అందుకు తన వంతు సహకారం తానందిస్తానన్నారు. కావాలంటే ప్రభుత్వం దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తానన్నారు. అంతేగాని తానేదో ఓ గ్రూపుకి వత్తాసు పలుకుతున్నట్లు ఎవరూ భావించరాదన్నారు. కాకినాడలో ఆస్తులు అమ్ముకొన్నారన్న డా.ఎం. రత్నకుమార్ మాట్లాడుతూ తాను ఆయా ఆస్తులను ఓ బిల్డర్‌కు డెవలెప్‌మెంట్‌కు మాత్రమే ఇచ్చానన్నారు. మీరంతా ఇప్పుడు కోరుతున్నారు కాబట్టి ఆ ఎగ్రిమెంట్‌ను కేన్సిల్ చేసుకుంటానని మాటిస్తున్నానన్నారు. తదుపరి సమావేశానికి హాజరైయ్యేటప్పుడు కెన్సిల్ చేసిన ఎగ్రిమెంట్‌తో వస్తానని ఎం.పి. హర్షకుమార్ సమక్షంలోనే పాల్గొన్న నాయకులందరికీ డా. ఎం. రత్నకుమార్ మాటిచ్చారు. సమావేశం ప్రారంభంలోనే మునుపు సి.బి.సి.ఎన్.సి. ఆస్తులు అమ్ముకొన్న పాస్టర్ డానియేల్ గాంధీని నాయకులందరూ వాధనలతో మాట్లాడకుండా అడ్డుకొన్నారు. అందుకు ఆయన సమావేశం నుండి నిష్క్రమించారు. అప్పటికింకా ఎం.పి. హర్షకుమార్ సమావేశానికి రాలేదు. డానియేల్ గాంధీ మధ్యలో వెళ్లిపోవడాన్ని పాల్గొన్న నాయకుల్లో కొందరు తప్పుపట్టారు. ఏదైతేనేం మొత్తానికి సి.బి.సి.ఎన్.సి. నాయకుల్లో ఎక్కువ శాతం వారిని ఒకే వేదికపై తీసుకొచ్చారు సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్ అని అత్యధికులు ఆయన్ని అభినందించారు. అందుకు సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్ ఇదంతా మీ సహకారం వల్లే జరిగిందని చెప్తూ ఇకపై కూడా మనమంతా ఇలాగే ఏకమై మన ఆస్తులను కాపాడుకోవాలని పిలుపిచ్చారు. తదనంతరం అందరికి విందు ఏర్పాటు చేస్తారు సంఘమిత్ర ఆర్. ఎస్. జాన్. ఈ సమావేశం ఇంత పబ్లిక్‌గా విశాఖసాగర తీరాన గల వై.యం.సి.ఎ.లో ఎం.పి. హర్షకుమార్‌కు స్వాగత ఫ్లెక్సీ బేనర్‌తో సహా జరిగితే దాన్ని రహస్య సమావేశమని కొందరు కాకినాడలో చెప్పుకొనుట కడుశోచనీయమని సి.బి.సి.ఎన్.సి. నాయకులు విచారం వ్యక్తం చేసారు. అది మంచి పద్ధతికాదని హితవు పలికారు.






## చాకిరేవు

-ఎడిటర్

**★ నన్ను చెరపవలెనని భక్తిహీనులు తమనోరు కపటముగల తమనోరు తెరచియున్నారు. వారు నా మీద అబద్ధములు చెప్పుకొనుచున్నారు. నన్ను చుట్టుకొని నా మీద ద్వేషపు మాటలాడుచున్నారు. నిర్నిమిత్తముగా నాతో పోరాడుచున్నారు.**

క్రైస్తవనాడు వ్రాతల్లో యదార్థతను, అందుగల దేవుని వాక్యపు లోతులను అనేకులు గమనించలేకున్నారు. అలాగే లోకాశల్లో కొట్టుమిట్టాడుతున్నవారు పై వాక్యాన్ని తమ జీవితాల్లో కన్పరుస్తున్నారు. దాన్ని క్రైస్తవనాడు యెడలను చూపుతున్నారు. అయినా సరే క్రైస్తవనాడు దేవుని వాక్యాన్ని, అందుగల దేవుని మనస్సును ప్రస్ఫుటీకరించక మానదు. వాక్యాన్ని ప్రేమించువారు మాత్రమే క్రైస్తవనాడును ప్రేమించగలరన్నది మాకు ముందునుంచే తెలుసు. క్రైస్తవనాడు దేవుని పక్షపాతి. అందెట్టి సందేహము పాఠకులకు వలదని సవినయంగా తెలియజేస్తూ వివరణలోకెళ్తున్నా...

అది పరలోకం. భూమిపై యాత్రికులుగా జీవిస్తున్న సమస్త మానవాళికై తండ్రియైన దేవునిచే కలుగజేయబడింది. ఇది లేఖనసాక్ష్యం. దేవుడు మనకోసం కలుగజేసిన పరలోకంలో స్థానం సంపాదించుకోండన్నది యేసుక్రీస్తు బోధనల సారాంశం. అది మరచి యేసుక్రీస్తును గూర్చి, తండ్రియైన దేవుని గూర్చి బోధిస్తున్న వారెందరో... ఈ లోకంలో స్థలాలు సంపాదించుకొనుటకు పడుతున్న ప్రయాస లేఖనాలనెరిగిన వారికి ఆశ్చర్యం కలిగించకమానదు. బైబిలు చదువుతూ గ్రహించువారు ఈ లోకంలో తనను మహిమ పర్చాలన్నది దేవుని ఉద్దేశ్యం. దేవుని గూర్చి ఎరుగని వారికి తెలియజేస్తామని మనయెడల దేవుని నమ్మకం. ఈ విషయాన్ని లేఖనాలు తెలుపుతున్నాయి. సర్వలోకులను 'శిష్యులనుగా' చేయమని యేసుకోరారు. లోకులను గూర్చి చింత లేశమాత్రమైనా లేకుండా కొందరు

## ★ భూమి యెహోవాది... తగవు వీళ్లది

స్థలాలను అక్రమంగా సంపాదించుకొనుటకును, అమ్ముకొనుటకును చూస్తున్నారని అనేకసార్లు మనం వార్తల్లో వింటున్నాం, చదువుతున్నాం. మరికొందరు చెప్పుకుంటుండగా కూడా వింటున్నాం. లోకులు భూములు సంపాదించుకొనుటకు ప్రయాసలు పడ్తున్నారంటే సరిపెట్టుకోవచ్చు, అది వారిష్టం. కానీ 'భూమి యెహోవాది' అని ఖండితంగా వ్రాయబడియున్న బైబిలును నిత్యం చదువు క్రైస్తవులు తమది కాని స్థలాన్ని సంపాదించుటకై అక్రమంగా ప్రవర్తించుట ఎంతవరకూ న్యాయం? ఆలోచించాలి. అలా ఎవరైనా ప్రశ్నిస్తే వారికి నిజాయితీగా జవాబు చెప్పలేని స్థితిలో ఈ భూములకై వెంపర్లాటలో పాల్గొను వారందరూ ఏం చెప్తారు? దైవ గ్రంథంలో (బైబిల్లో) మనందర్ని గూర్చి యాత్రికులని వ్రాయబడింది. భూమిపై మనం పరదేశులం అని వ్రాయబడింది. యాత్రికులంటే మనకు తెలియందేం కాదు. ఏదైనా ఒక ప్రాంతానికి వెళ్లి దర్శించుకొని యాత్ర ముగించుకొని మరలా మన గమ్యస్థానానికి (మన ఊరికి) చేరుకుంటాం. ఆలాగుననే పరదేశులం అని ఉందంటే మనది ఈ దేశం (ఈ లోకం) కాదని బైబిలు లేఖనార్థం. మరి మన దేశం ఏది?

**★ అయితే వారు శ్రేష్టమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు.**

అబ్రహాము ఇస్సాకు యాకోబులను గూర్చి వారు భౌతికంగా దైవాశీర్వాదాలతో వర్ధిల్లినట్లు బైబిల్లో చూడగలం. అట్టివారే భూమిపై గుడారాలలో నివసిస్తూ ఈ లోకం వారిది కానట్లు పునాదులు గల ఆ పరలోక పట్టణం కొరకు ఎదురుచూచినట్లును చదువగలం. ఎందుకనగా పరలోకపట్టణానికి దేవుడే శిల్పి, నిర్మాణికులైయున్నారని తెలుసుకొన్న వారెంతో ధన్యులు. కనుకనే అబ్రహాము ఇస్సాకు యాకోబుల చరిత్ర మనం మాట్లడకుండా బైబిలును గూర్చి చెప్పలేం.

*మిగతా వచ్చే సంచికలో*

## వింత పోకడలు.. అసహ్యకర కోర్కెలు..! వీళ్లా నాయకులు?!

దేవుని జ్ఞానం ఎరుగుతూ అనేకులకు ప్రకటిస్తున్నామని చెప్పుకొంటూ ఆస్తులకోసం ప్రార్థనలు చేయమని విశ్వాసులకు, ఫెలోషిప్పుల్లో పాల్గొన్న కాపర్లకు నేర్పుతున్న ధౌర్భాగ్యులు రాష్ట్రమంతా పుట్టుకొస్తున్నారు. వీరి గొంతెమ్మ కోర్కెలు కడువింతగా ఉంటాయి. దేవుడు 33 కోట్లు ఇస్తే చర్చి కడతా నంటాడొక దగాకోరు. 500 కోట్లు వస్తే సేవ గొప్పగా చేస్తానంటాడు ఒక వెర్రోడు. 1000 పడకల హాస్పటల్ కట్టి జిల్లాలు జిల్లాలకే సేవలందిస్తా ననంటాడొక పిచ్చోడు. ఇలా వింత వింత పోకడలకు పోతుంటారు. వీళ్లకు ఇలాంటి పేర్లు పెట్టానేంటని పాఠకులు ఆశ్చర్యపోకండి సుమా! ఆ పేర్లకు వారు తగినవారే! ఎందుకంటే అలాంటి కోర్కెలు కోరే వారు తమ దగ్గర ఉన్నదాన్ని మాత్రం క్రీస్తు సేవా పరిచర్యల కొరకు పోగొట్టుకొనుటకు ఇష్టపడరు. ఆయా ఆస్తులు మాత్రం అలాగే ఉండాలి. వీరి మదిలో పుట్టే కొత్త కొత్త కోర్కెలు తీరేందుకు మాత్రం ప్రభువు సహాయం చేయాలి. అందుకోసం ఏ అమాయక విదేశీయున్నో, స్వదేశీయున్నో లేపాలట! ఇదేం న్యాయం? ఆలోచించాలి. అలాంటివారందరూ కూడా బైబిలు ప్రతి దినం చదువుతూ తగుదున్నమా అంటూ బోధించేస్తుంటారు. అసలు బైబిలు వీళ్లకు అర్థమైందంటారా? అర్థమవలేదనే మనము నమ్మొచ్చు. ఎందుకంటే బైబిల్లో గల దేవుని మనస్సు, కోరిక అర్థమైన వారు ఆత్మలు సంపాదించు భారం కలిగుంటారు. ప్రతి దినం బైబిలు చదువుతున్నా వీరి గొంతెమ్మ కోర్కెలిలా దిన దినం పెరిగిపోతున్నా యంటే వీరిని ఇంకేం పేరుపెట్టి పిలవాలో మీరూ చెప్పొచ్చు. తదుపరి రచనల్లో ఆయా పేర్లను వాడుతా! తమకున్న దాంతోనే అనేకులకు ఆధరణకరంగా ఉంటూ క్రీస్తును ప్రకటించుట సిసలైన క్రీస్తు శిష్యుల లక్షణం. ఆనాడు అపోస్తలులు అదే చేసారు. తమకున్నది క్రీస్తు కొరకు పోగొట్టుకొన్నవారు మరి ధన్యులు. అట్టి వారెన్నటికీ చెడిపోరు. ఇది లేఖన భరోసా.

ఇవన్నీ నేటి దినాల్లో జరుగుతున్న నిత్య సత్యాలు. కాబట్టి క్రైస్తవులు పై విధంగా ఉన్న వారి కోవకు చెందరాదన్నది తెలిపేందుకే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం

> *దేవుడు 33 కోట్లు ఇస్తే చర్చి కడతానంటాడొక దగాకోరు. 500 కోట్లు వస్తే సేవ గొప్పగా చేస్తానంటాడు ఒక వెర్రోడు. 1000 పడకల హాస్పటల్ కట్టి జిల్లాలు జిల్లాలకే సేవలందిస్తాననంటాడొక పిచ్చోడు.*





Those who seek the Lord lack no good thing. (psalm 34:10)



B.R. KUMAR

KUMAR CATERING SERVICES

CATERING IN VEG & NON-VEG. MEALS & TIFFINS

D.No. 50-80-21, Gurudwar Jn., Santhipuram, Visakhapatnam- 530016

CELL : 98491 80867, 9966382928




Rokkam Raju

SHARON SERVICES

REPUTED CHRISTIAN DESIGNERS & PRINTERS

HYDERABAD

CALL : 9247859435, 9705211609

## పి.జె. స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో

# మెగా ఉచిత వైద్య శిభిరం



*__14 సెప్టెంబర్, గోపాలపట్నం :__* రెవ.డా పి.జె. స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గోపాలపట్నం అంబేద్కర్ ఆడిటోరియం వద్ద ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో సాధారణ వైద్య, రక్త , స్త్రీ సంబంధిత, దంత, కంటి పరీక్షలు మరియు చిన్న పిల్లలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసారు. ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ వైద్య శిభిరంలో పాల్గొన్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మినిస్ట్రీవారు తమ సేవా భావాన్ని చాటారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసారు. ఒకే చోట అన్ని విధాల పరీక్షలు చేయించుకొనే అవకాశం కల్పించబడుటవలన వచ్చిన ప్రతి ఒక్కరు ఈ సౌకర్యాన్ని సద్వినియోగ పరచుకున్నారు. అనేక మంది ప్రజలు మెరుగైన ఉచిత వైద్య సదుపాయాలు పొందారు. సంతోషాన్ని వ్యక్తపరచారు. అనేకులకు ఉచిత కంటి ఆపరేషన్ సౌలభ్యాన్ని కల్పించారు. అందువల్ల ప్రజలు ఆనందించి దేవుని ఘనపరిచారు. ఈ సేవా శిభిరంలో పాల్గొన డాక్టర్లను,ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసిన రెవ.డా. పి.జె. స్టీఫెన్‌పాల్‌ను మరియు వారి మినిస్ట్రీని స్థానిక ప్రజలు అభినందించారు. తద్వారా దేవునికి మహిమ కలిగిందని పాల్గొన్న క్రైస్తవులు తమ అభిప్రాయం వ్యక్తంచేసారు. శిభిరంలో పాల్గొన్న డాక్టర్లు ప్రొ. అర్జునరావు, నాగేశ్వరరావు, పార్థశారధి, అ.ప్రొ.రవి, సౌదామిని, ఆనంద్‌కుమార్, సంధ్య, కె.జె.పాల్ తదితరులందరికీ మినిస్ట్రీ వారు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిభిరం నిర్వహించడానికి 'ఆపరేషన్ బ్లెస్సింగ్ ఇండియా, హైద్రాబాద్' తమ సహకారాన్ని అందించగా, శంకర్ ఫౌండేషన్ సేవలు అందించింది. ఇటువంటి శిభిరాలు మరెన్నో జరిపితే అనేక మంది బీధలకు నిపుణులైన వైద్యుల ద్వారా వైద్యసేవలు అందుతాయని స్థానికులు భావించారు.

5వ సంవత్సరంలో ప్రవేశించిన

క్రైస్తవనాడుకు

అభినందనలు



రెవ.డా. సిహెచ్. అర్జునరావు

(డైరెక్టర్)

విజన్ నేటివ్స్

కొమ్మాది, మధురవాడ,
విశాఖపట్నం

ఇప్పుడు వెబ్‌సైట్‌లో... క్రైస్తవనాడు www.christavanaadu.com

సాతాను డేంజరా ? ఎవరికి ?

*రచన :* పాస్టర్ కె. డానియేల్ అబ్రహామ్ M.Div తిరుపతి

అక్టోబర్‌లో... చదవండి!

## యేసు చేసిన, చేయమన్న పరిచర్యలంటే ఇవేనా...? - *ఎడిటర్*

◆ ఆనాథాశ్రమాల పేరిట విలాసాలు వెలగబెడుతున్న మిషనరీలు! ◆ విధవరాండ్ల పెన్షన్ల పేరిట దండుకుంటున్న వారు! ◆ నూనె అమ్ముతారు కొందరు! ◆ రుమాళ్లు అమ్ముతారు మరికొందరు! ◆ స్వస్థత నేనే ఇస్తానంటాడొకడు! ◆ మా దగ్గరకు రండి మీ దు:ఖదినములు సమాప్తమంటాడింకొకడు! ◆ బీదవాడు మా దగ్గరకొచ్చి ప్రార్థించి బాగుపడ్డాడంటాడొకడు! ◆ ప్రోగ్రాం స్పాన్సర్ చేసి బాగుపడ్డారని.. ఇలా ఎన్నో దిక్కుమాలిన ఉదాహరణలు చెప్తాడొకడు! ◆ చేతి కర్రలు వదిలించి నడిపించి చూపుతూ బాగుపడ్డాడని చెప్తాడు మరొకడు! ఇలా ఎన్నో రకాలుగా ప్రకటించుకుంటారు, స్వస్థత లేక బాగుపడిన వారి అడ్రసు మాత్రం చెప్పరు.

*రాబోవు క్రైస్తవనాడుల్లో పై వాటికి సంబంధించిన వివరణలు వరుసగా వస్తాయి. చదవండి! అలాంటి వారిని నిలబెట్టి ప్రశ్నించి, సరిచేయండి!! మీ దృష్టిలోనూ ఇప్పటికే ఎవరైనా అలాంటివారు ఉంటే మాకు వెంటనే తెలియజేయండి.*

# సిద్ధాంతాలతో రాద్ధాంతాలు!

**(క్రైస్తవులు ఇది చదివి ఆచరిస్తూ ఇతరులకు ప్రకటించాలి. అలా ఆచరణలో కనపరచి ప్రకటిస్తేనే ఇతరులు నమ్మేందుకు ఆస్కారముంది! గ్రహించండి.)**



**డి. సోలోమోన్ రాజు, విశాఖ**

*(గతసంచిక తరువాయి...)*

కొందరు హత్యలు చేయబడుచున్నారు. అనగా **ఆస్థిగలవారు తమ ఆస్థిని దాచిపెట్టుకొని తమకు నాశనము తెప్పించుకొందురు (ప్రస. 5:13 యాకో 5:1).** అసలు మనము ప్రయాసపడవలసింది పరలోకములో ధనము కూర్చుకొనుటకేగాని భూలోకములో ధనము కూర్చుకొనుటకుగాదు (మత్తయి. 6:19-20, యాకో 5:2-3) మరియు మన తలంపులు పైనున్న వాటిమీదనేగాని భూ సంబంధమైన వాటిమీద ఉండరాదు (కొలస్సీ 3:3). చివరకు ఈ ధనాపేక్షే దేవుని రాజ్యములో మనల్ని ప్రవేశింపకుండా చేయును (మత్త 19:23-24) గనుక ఈ లోక ఐశ్వర్యము పొంద ప్రయాసపడకుము.

మీకు అట్టి అభిప్రాయము కలిగిననూ దానిని విడిచిపెట్టాలి. దానిమీద ( దేవునిమీదకాక ధనము మీద) మనస్సు నిలిపినతోడనే అది లేకపోవును నిశ్చయముగా అదిరెక్కలు ధరించి పక్షిరాజు ఆకాశమునకు ఎగిరిపోవునట్లు అది ఎగిరిపోవును (సామె. 23:4). కాబట్టి ఇహమందు ధనవంతులైనవారు గర్విష్టులుకాక, అస్థిరమైన ధనముయందు నమ్మిక యుంచక దేవునియందు నమ్మిక ఉంచాలి (1తిమో 6:17). నమ్మకమైనవానికి మెండుగా దీవెనలు కలుగును (సామె. 28:20). లేనియెడల ధనమును నమ్ముకొనువాడు పాడైపోవును (సామె. 11:28). గనుక ధనము హెచ్చిననూ దానిని లక్ష్యపెట్టకుడి (కీర్తన 62:10). ఈ ధనవే కుటుంబాలమధ్య, మనుష్యులమధ్య స్వార్థాన్ని హెచ్చుతగ్గులను కలుగజేసి ప్రేమ, సమాధానము లేకుండా చేస్తుంది. మానవులమధ్య పొత్తులు పెట్టుకొనుటకు బదులు కత్తులు పట్టుకొనుటకు పురిగొల్పుచున్నది. గదిలో పెట్టుకొని ఆరాధించే మట్టి విగ్రహారాధన కంటే మదిలో పెట్టుకొని (యెహె 14:7) ఆరాధించే 'మనీ' విగ్రహారాధన (దనాపేక్ష) చేయుటే అతిభయంకరమైన పాపము. ఇటువంటి పాపమైన విగ్రహారాధనయను ధనాపేక్షను చంపివేయుడి (కొలస్సీ 3:5). మరికొందరు దేవుని భయములేక భక్తి హీనతచే సంపాదించుటవలన అది పాపము పుట్టిస్తున్నది (సామె 10:16). ఉదా॥ త్రాగుడు, జూదము, వ్యభిచారము మొ॥నవి. అనేకమంది ధన నష్టము, ప్రాణ నష్టము కొనితెచ్చుకుంటున్నారు. (తిమో 6:9) అన్యాయముగా కాక నీతిగా సంపాదించిన దానిపై దేవుని 'అనుగ్రహము' ఉండును (సామె 13:11). అవినీతిగా భక్తి హీనతతో సంపాదించినదానిపై దేవుని 'ఆగ్రహము' ఉండును (యోబు 20:28). అనగా భక్తితో నీతిగా సంపాదించినది 'క్షేమము' కలిగించును. భక్తిహీనతతో అవినీతిగా సంపాదించినది శ్రమకు కారణమై 'క్షామము' కలిగించును (సామె 15:6). దేవుని భయములేక సంపాదించిన ఐశ్వర్యముకంటే దేవునియందలి భయమే ఐశ్వర్యం (యెష 33:6) గా ఏ కుటుంబం ఉంటుందో దానికి ఆ భయము వినయమును, వినయము ఐశ్వర్యము, ఘనత, జీవమును దేవునినుంచి తెచ్చును (సామె 22:4). భక్తిలేని అవిధేయులమీదకు దేవుని ఉగ్రత వచ్చును (కొలస్సీ 3:6). గనుక దేవునికి చోటియ్యుడి గానీ అపవాదికి చోటియ్యకుడి (ఎఫెసీ 4:27). చోటిచ్చిన ఇస్కరియోతు యూదా (అ॥కా॥ 1:8), అననీయ, సప్పీరా (అ॥కా॥ 5:5,10) ఈ ముగ్గురూ మరణాన్ని కొనితెచ్చుకున్నారు. వారికేమైనా ప్రయోజనమున్నదా? అయితే ధనము అవసరమేగానీ, ధనము ఎక్కడవుండునో హృదయము అక్కడనే ఉండును (మత్త 6:21) గానీ దేవునిపై ఉండదు. గనుక ధనాపేక్ష ఉండరాదు. మనమీలోకానికి ఏమియూ తేలేదు.దీనిలోనుండి ఏమియూ తీసుకుపోము. అనగా తల్లి గర్భమునుండి ఏ ప్రకారము వచ్చితిమో ఆ ప్రకారమే దిగంబరిగా మరలా పోవుదుము. అలాంటప్పుడు గాలికి ప్రయాసపడి సంపాదించిన దానివలన కలిగిన లాభమేమి? (1తిమో 6:6-7, ప్రస 5:15-16). 'దైవాపేక్ష' సమస్త దీవెనలకు మూలము, 'ధనాపేక్ష' సమస్త శోధనలకు మూలము. గనుక దేవునియందు భయభక్తులు గలవారమై, ధనాపేక్ష లేనివారమై కలిగినవాటితో తృప్తి పొందుదుము (హెబ్రి 13:5). సంతుష్టి సహితమైన భక్తి గొప్ప లాభసాధనమై యున్నది (1తిమో 6:6). మనలను విడువను ఎడబాయను అన్న దేవునికి చోటివ్వగా వచ్చే సిరి ఆశీర్వాదకరము. దురాశలు చూపించి నాశనమునకు నడుపుచున్న దుష్టునికి చోటివ్వగా వచ్చే సిరి ప్రమాదకరము. దేవునికి చోటిచ్చుల వలన అది నీ హృదయమునకు 'జీవనదిని', నీ గృహానికి 'ధననిధిని' తెచ్చును. దైవాపేక్ష= దేవునికి చోటిచ్చుట, ధనపేక్ష= దుష్టునికి చోటిచ్చుట. దైవాపేక్ష 'సిరిని' తెచ్చును- ధనాపేక్ష 'ఉరిని' తెచ్చును. సిద్ధాంతాలతో కొట్టిమిట్టాడువారు ధనాపేక్షకు సంబంధించిన బోధలే బోధిస్తారు. కాబట్టి సిద్ధాంతాల బోధలో పడి మీ జీవితాల్లో రాద్ధాంతాలు తెచ్చుకోకండి.



బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను పటాపంచలుగావించే.....దుర్బోధకులకు చెక్ పెట్టే....?!

'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా'

# మీరింకనూ గ్రహింపకున్నారా?

మన ప్రభువైన యేసుక్రీస్తు మీరు చదువలేదా? అని ప్రశ్నించినట్లు బైబిల్లో చాలా చోట్ల చూడగలం. అలాగే 'మీరింకనూ గ్రహింపకున్నారా?' అనికూడా ఆయన అడిగినట్లు చూడగలం. ఆయన ప్రశ్నల్లోనున్న అంతరార్థాన్ని గ్రహించుటే మన ఆధ్యాత్మిక జీవితానికి చుక్కాని కావాలి. ఏదైనా చదివితేనే కదా గ్రహించగలం. అందువల్ల చదువుట ఎంత ముఖ్యమో దాన్ని గ్రహించుట అంతకన్నా ముఖ్యం. అపుడే ఎవరైనా దేవునిలో (వాక్యంలో) ఎదుగ గలరు. ఇంతకూ చదవడం లేక పఠనం అంటే ఏమిటి? మనకు తెలిసిన భాషలో మన చేతిలోనున్న పుస్తకం అక్షర, పదాల క్రమంచొప్పున చదువుకొంటూ ముగించుటేనా? అలా ఎన్నటికి కారాదు సుమా! అలా చదివి ముగించు వారికి దాన్లోగల విషయపరిజ్ఞానం అర్థంకాదని గ్రహించాలి. నేనెందుకు అలా అంటున్నానంటే... **మనలో అనేకులు నేను బైబిలును అన్నిసార్లు చదివాను, ఇన్ని సార్లు చదివాను అని చదివిన సంఖ్యలను గొప్పగా చెబుతుంటారు. ఇంకొందరైతే బైబిలును ఒక సంవత్సరంలో ముగించాలని చెబుతుంటారు. మరికొందరు నేను బైబిలును ఏయేటికాయేడు చదివి ముగించి మురుసటేడు క్రొత్త బైబిలు కొనుక్కొని అదీ అలాగే చదివి ముగిస్తానని గొప్పలు పోతుంటారు.** ఇటువంటివే కాక మరనేక విధాలా ఈ చదువుటను గూర్చి మీరూ వినే ఉంటారు. నేను విన్నదే కాక అనేకమంది నాకు ఇలాంటి విషయాలను గూర్చి తెలుపుతూ దేవుని జ్ఞానమును బట్టి వివరణ చెప్పరూ? అని అడిగారు. దాన్ని బట్టే ఈ వివరణ. అసలింతకూ చదువుట లేక పఠనం అంటే... ప్రముఖ తెలుగు పండిట్ డాక్టర్ ద్వా.నా. శాస్త్రి (డి.ఎస్.సి.2008) ఇచ్చిన వివరణ ఎలా ఉందో ఓసారి చూద్దాం. "పఠనం అంటే 'చదవడం' అని మాత్రమే కాదు. లిఖితరూపపదాలను చూసి వాగింద్రియాల సహాయంతో ఉచ్ఛరించి, భావాన్ని గ్రహించడాన్ని 'పఠనం' అంటారు". ఆయన ఇంకా ఏం చెప్పారంటే 'ఉత్తమ గ్రంథ పఠనం మనిషి మూర్తిమత్వానికి సహకరిస్తుంది. జ్ఞాన సంపద విస్తరించాలంటే 'పఠనం' తప్పదు. వెనుకటి తరం మనుషుల ఆలోచనలను భద్రపరచేది పుస్తకం. అందువల్ల లోకజ్ఞానం అలవడాలంటే 'పుస్తక పఠనం' అవశ్యం. లోకాన్ని చూడడానికి కన్ను ఎంత అవసరమో లోకజ్ఞానం పొందడానికి 'పఠనం' అంత అవసరమని గ్రహించాలి. ముందుగా ఉపాధ్యాయులకు నిత్య విద్యార్థిగా పఠనశక్తి ఉండాలి. లేకపోతే వారికి సమకాలీన స్పృహ ఉండదు'.

ప్రభువునందు ప్రియులకు, పఠనాన్ని గూర్చిన వివరణ ఆసాంతం చదివారని, గ్రహించారనే నా నమ్మిక. లోకజ్ఞాన సంబధ పుస్తకాలను గూర్చే అంత జాగ్రత్త తీసుకుంటే మరి దేవునిజ్ఞాన గ్రంథమని మనం చెప్పకునే లేక చెబుతున్న బైబిలు పఠనాన్ని గూర్చి మరెంత జాగ్రత్తపడాలో మీరే ఆలోచించండి.

*(మిగతా వచ్చే సంచికలో)*

ఇప్పుడు వెబ్‌సైట్‌లో... క్రైస్తవనాడు www.christavanaadu.com

## స్పృష్టికర్త..



కొమ్మలనడుమ-రెమ్మలమీద-కోయిలమ్మ నడిగా!
ఎవరిచ్చారమ్మ-నీకు- ఈ - సుస్వరగళం?
నిన్ను - నన్ను - సృజించిన - సర్వాధికారి - సత్యదేవుడు - యెహోవ సుమ్మా.

హరిణమునడిగా - హంసనడిగా!
ఎవరిచ్చారమ్మ మీకు - కనులకింపైన ఈ సొగసు?
నిన్ను - నన్ను - సృజియించిన - అపురూప శిల్పి - అతిసుందరుడు యెహోవా సుమ్మా.

విరజాజులనడిగా - సిరిమల్లియనడిగా!
ఎక్కడివమ్మ - ఆ సుపరిమళాలు మీకు?
నిన్ను - నన్ను - సృజింయించిన - కర్పూరజటామాంసి - సృష్టిదాత -
కరుణారస - వాత్సల్యుడు యెహోవా సుమ్మా.

చుక్కలనడిగా - చుక్కలనడుమ - ఆ చంద్రుని అడిగా!
ఎవరునింపారమ్మ - ఆ జిలుగు వెలుగులతో మిమ్ము?
నిన్ను - నన్ను సృజింయించిన - అపరతేజోమయుడు - నీతి భాస్కరుడు - యెహోవా సుమ్మా.

ఇంద్రధనస్సునడిగా - సంధ్యాసమాయాన్ని అడిగా!
ఎక్కడివమ్మ - ఆ రంగు రంగుల రమ్యాలు మీకు?
నిన్ను - నన్ను - సృజియించిన ధవళవర్ణుడు - రత్న వర్ణుడు- యెహోవా సుమ్మా.

గూటిలోన గువ్వనడిగా - గూడబాతు నడిగా!
ఎవరు నేర్పారమ్మ మీకు - ఆ బుడిబుడి వడివడి నడకలు?
నిన్ను - నన్ను సృజియించిన - నింగినున్న నిత్యనివాసి యెహోవా సుమ్మా

సహోదరి వివేకవతి. జో
విజయనగరం




# తెలుసుకుందాం!

★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును



※ నీలి తిమింగలం బొడ్డు వ్యాసం దాదాపు 8 అంగుళాలు ఉంటుంది.

※ కంప్యూటరైజ్డ్ ట్రాఫిక్ సిగ్నల్‌ను మొట్టమొదట అమలు చేసిన నగరం టొరంటో. ఇది కెనడాలో ఉంది.

※ మొదటి ఎలిజబెత్ రాణి మరణించేనాటికి ఆమెకు 3000 గౌన్లు ఉండేవట.

※ సింగపూర్‌లో చూయింగ్ గమ్ అమ్మటం, కొనటం, రెండూ చట్టవిరుద్ధమే.



※ బెల్జియంలో సంవత్సరానికి 1,72,000 టన్నుల చాక్లెట్స్ ఉత్పత్తి అవుతున్నాయి.

※ మనిషి శరీరంలో ఉండే కొవ్వుతో ఏడు సబ్బుల్ని తయారుచేయవచ్చు.

※ ఒక పౌండ్ చక్కెరను శుద్ధి చేయడానికి ఒక టన్ను నీళ్లను ఉపయోగిస్తారు.

※ కుందేలు గురించి చెప్పేటప్పుడు హేర్స్/రాబిట్ ఈ రెండిట్లో ఏదో ఒక పేరు చెప్తారు సాధారణంగా. కానీ ఆ రెండూ వేర్వేరు జాతులు. రాబిట్ జాతి కుందేళ్లకు పుట్టుకతో చూపు ఉండదు. హేర్స్ జాతి కుందేళ్లు పుట్టిన క్షణం నుంచే ప్రపంచాన్ని చూడగలవు.

※ జపాన్‌లో పుచ్చకాయ ధర వంద డాలర్లు ఉంటుంది. అంటే మన కరెన్సీతో పోల్చితే అది నాలుగు వేలు పలుకుతుంది.

※ ఎలుకలు వాంతి చేసుకోలేవు. అందుకే ఎలుకల మందు వాటిపై బాగా పనిచేస్తుంది.





※ అమెరికాలో 2-8 సంవత్సరాల వయసున్న పిల్లలు ఒకరోజులో 28 నిమిషాలు బొమ్మలకు రంగులు వేయటంలో గడుపుతున్నారట.



※ సునామీ సమయంలో అలలు ప్రయాణించే వేగం జెట్‌విమాన వేగంతో సమానంగా ఉంటుంది.

"జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములు పలుకును" సామె. 15:2 "అతడు నా నామము నెరిగినవాడు గనుక నేనతని ఘనపరతును" కీర్త. 91:14

కవి సార్వభౌమ రెవ. పురుషోత్తమ చౌధరి 208వ జయంతి సందర్భంగా

విశాఖ వై.యం.సి.ఎ. ఆధ్వర్యంలో



# రాష్ట్రస్థాయి ఆంధ్ర క్రైస్తవ కవి సమ్మేళనం, సన్మానం

2010 అక్టోబర్ 1, 2, 3 | వేదిక : విశాఖ తీరం

**ప్రధాన సభ : అక్టోబర్ 2 సా॥ 5 గం॥ కళాభారతి ఎ.సి. ఆడిటోరియం**

అందరూ ఆహ్వానితులు

<u>ముఖ్య అతిథి</u>

**రెవ. దాసు బాబు గారు**

<u>విశిష్ట అతిథి</u>

**వందేమాతరం శ్రీనివాస్ గారు**

మరియు

**పురుషోత్తమ చౌదరి ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు**

<u>ప్రత్యేకం</u>

**డా.ఎన్. జయకుమార్ రావు గారి**

**" మనసులోతుల్లోకి దూరి"**

**కవితాసంపుటి ఆవిష్కరణం**

*నిర్వాహణ కమిటీ:* డా. ఎం. జయకుమార్ రావు గారు, డా. కొండెపోగు బి. డేవిడ్ లివింగ్ స్టన్ బ్రదర్ బెల్లంకొండ శివాజీరాజు

# బ్రదర్ అనీల్ పాల్ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్టియన్ ప్రేయర్ రైడ్ ప్రారంభం

<u>*సెప్టెంబర్ 18, విశాఖ సాగరతీరం :*</u> ప్రతీ రెండు నెలలకోసారి బ్రదర్ అనీల్ పాల్ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్టియన్ ప్రేయర్ రైడ్ జరపాలని నిర్ణయించారు. దాన్ని బట్టి నేడు విశాఖ సాగర తీరంలో గల ఫిషింగ్ హార్బర్ నుంచి తెన్నేటి పార్కు వరకు అనేక మంది యూత్ ఈ రైడ్‌లో పాల్గొన్నారు. ప్రతీ కూడలిలోనూ ఆగి ప్రార్థనలు చేసారు. ఈ కార్యక్రమాన్ని బ్రదర్ అనీల్ పాల్ తండ్రియైన రెవ.డా. ఎం.ఎ.పాల్ ప్రార్థనతో ప్రారంభించారు.ఈ రైడ్‌ను గూర్చి బ్రదర్ అనీల్ పాల్ వివరణ ఇస్తూ ఇది ఏ డినామినేషన్‌కు చెందింది కాదన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు. ఈ రైడ్‌లో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో గల ప్రతీ సంఘంలోనున్న యూత్‌ను ఐక్యం చేస్తూ రాబోవు దినాల్లో ఈ కార్యక్రమాన్ని బహుగా విస్తరించాలన్న సంకల్పాన్ని బ్రదర్ అనీల్ పాల్ కన్పర్చారు. అందుకు అందరి సహకారాన్ని కోరారు. తాను ఎఐసిసిని గూర్చి ప్రస్తావించినా ఈ రైడ్ మాత్రం ఎవరికీ చెందింది కాదని ఇది అందరికీ సంబంధించినదని తెలిపారు. విశాఖ ప్రాంతంలో ఈ ప్రార్థన రైడ్‌వల్ల దేవుని కార్యాలు ఇకపై బలంగా జరుగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో అనేక విధాలుగా మార్పు చెంది విస్తరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తపర్చారు. ప్రముఖ పాస్టర్లు, యువ నాయకులు పాల్గొన్నవారిలో ఉన్నారు. చూడాలి మరి, రాబోవు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని బ్రదర్ అనీల్ పాల్ ఎంతవరకు తీసుకెళ్లనున్నారో! మరెందరికి సహకారంగా మార్చనున్నారో!!




జీవితం నూతనపరచే
క్రీస్తు ఆశీర్వాద సభ
అందరూ.. ఆహ్వానితులే
గురజాడ కళాక్షేత్రం,
సిరిపురం జం॥
విశాఖపట్నం -03
2010
ప్రతి నెల మొదటి ఆదివారం
ప్రత్యేక గమనిక:
సా॥ 5:00 నుండి 8:00 గం॥ వరకు
అక్టోబర్ 3

Watch Every Month 2nd Sunday in ఆరాధన
2:30 pm to 4:30 pm
Live Tele- Crusade
Be BLESSED
Dr. P.J. Stephen Paul
వివరములకు: 9393117979



*Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 3-178, 5th Lane, Adarsh Nagar, Visakhapatnam - 530 040, Andhra Pradesh.*
*Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20*